క్లుప్తంగా

అందరికీ కృతజ్ఞతలు


ఎంపీపీ వెంకటరాజారామ్

మాడుగుల రూరల్: స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన బాధ్యతల స్వీకరణకు తరలివచ్చిన ప్రజలకు ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఎంపీపీ చాంబర్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా తనను ఆశీర్వదించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మండల స్థాయి ప్రజా ప్రతినిధులతోపాటు కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు, వైఎస్సార్ కుటుంబ సభ్యులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, సోషల్ మీడియా కన్వీనర్లకు ధన్యవాదాలు తెలియజేశారు.

సుద్దలపాలెంలో వైద్య శిబిరం

గొలుగొండ: గిరిజన గ్రామాల్లో వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందించడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ తెలిపారు. సుద్దలపాలెంలో సోమవారం గిరిజన ప్రజలకు వైద్య సేవలు అందించారు. గొలుగొండ వైద్యాధికారి శ్యామ్ సూచనల మేరకు గిరిజన గ్రామాల్లో నూరు శాతం వైద్య సేవలు అందిస్తున్నట్లు ప్రసాద్ చెప్పారు. 28 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ సభ్యులు

గొలుగొండ: ఏఎల్ పురంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సోమవారం సర్పంచ్ లోచల సుజాత శంకుస్థాపన చేశారు. అనకాపల్లి ఎంపీ బి.సత్యవతి ఈ గ్రామంలో ఎస్సీ కాలనీ పరిధిలో సామాజిక భవనం నిర్మాణం కోసం రూ.8 లక్షల మంజూరు చేయడంలో పనులు ప్రారంభించారు. ఎస్సీ పరిధిలో ఉన్న ప్రాంతాల్లో కమ్యూనిటీ హాళ్లు మంజూరు చేయడం ఆనందంగా ఉందని, దీనికి సహకరించిన ఎంపీ సత్యవతి, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌తోపాటు మండల నాయకులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు చింతల బుల్లి ప్రసాద్, మామిడి కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సీతారామాలయ నిర్మాణానికి భూమిపూజ

రావికమతం: కొత్తకోటలోని గత్రెడ్డి వారి రామ మందిరం స్థానంలో నూతనంగా శ్రీ సూర్య సీతారామచంద్రమూర్తి ఆలయ నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. గత్రెడ్డి వారి కుటుంబ సభ్యులతోపాటు రామాలయ అనుబంధ కుటుంబీకులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై కళాజాత

మాకవరపాలెం: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని లచ్చన్నపాలెం, గిడుతూరులో ఎయిడ్స్ నివారణపై కళాజాత నిర్వహించారు. ఎయిడ్స్ నివారణపై కళారూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళా బృందం వివరించారు. కరపత్రాలను పంచారు. అందరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని లింక్ వర్కర్ స్కీం జోనల్ సూపర్‌వైజర్ రమణ సూచించారు.

శెట్టిపాలెంలో గ్రామసభ

మాకవరపాలెం: మండలంలోని శెట్టిపాలెంలో తహసీల్దార్ మురళీమోహనరావు గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామంలో మైగ్రేషన్ ఓటర్లపై సర్పంచ్ అల్లు రామునాయుడు ఇచ్చిన ఫిర్యాదుతో సోమవారం సచివాలయంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న ఓటర్ల వివరాలను తెలుసుకున్నారు. ఎన్నికల సంఘ నిబంధనల మేరకు పూర్తిస్థాయి విచారణ చేపడతామని తహసీల్దార్ విలేకరులకు తెలిపారు. డీటీలు శంకర్, కృష్ణమూర్తి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీపీ సర్వసభ్య సమావేశం నేడు

కె.కోటపాడు: ఈ నెల 20న కె.కోటపాడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి ఎంపీటీసీ, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రగతి పథాన పల్లెలు

- సీఎం వైఎస్ జగన్ సుపరిపాలనలో గ్రామ స్వరాజ్యం సాకారం
- 6 గ్రామాల్లో రూ.4 97 కోట్లతో అభివృద్ధి పనులు
- నేడు ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం బూడి
- గ్రామ ప్రజల్లో ఎనలేని ఆనందం




ఎ.కోడూరులో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం


కె.కోటపాడులో ఆధునికీకరించిన ఎంపీడీవో కార్యాలయం


ప్రారంభోత్సవానికి తుదిమెరుగులు దిద్దుకుంటున్న గ్రామ సచివాలయం


రైతు భరోసా కేంద్ర భవనం

కె.కోటపాడు: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో సాకారమవుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పల్లెలు ప్రగతి పథాన సాగుతున్నాయి. అన్ని గ్రామాల్లో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతుండటంతో ప్రజల్లో ఎనలేని ఆనందం వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వాల హయాంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిన అభివృద్ధి.. సీఎం వైఎస్ జగన్ పాలనలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సహకారంతో రాకెట్ వేగంతో దూసుకెళ్తుండటంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

కె.కోటపాడు మండలంలోని ఆరు గ్రామాల్లో మంగళవారం పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్‌కు చెందిన రూ.4.97 కోట్లతో నిర్మాణాలు పూర్తి చేసుకున్న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు జరగనున్నాయి. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవాలను పండగ వాతావరణంలో అట్టహాసంగా జరిపేందుకు ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆరు గ్రామాల్లో చేపట్టిన పనులు

మండలంలో ముందుగా పాడుగుపాలెంలో రూ.82.50 లక్షల నిధులతో నిర్మాణాలు పూర్తి చేసుకున్న సీసీ రోడ్లు, ఇంటింటి కుళాయిలు, ఎ.కోడూరులో రూ.1.86 కోట్లతో జరిగిన మంచినీటి పథకం, ఇంటింటి కుళాయిలు, సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ భవనాలను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభించనున్నారు. అక్కడ నుంచి వి.సంతపాలెంలో రూ.54.60 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్, రైతు భరోసా కేంద్ర భవనం, డ్రైయిన్లు, రామచంద్రపురంలో రూ.10 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం, కె.కోటపాడులో రూ.37 లక్షలతో ఆధునికీకరించిన ఎంపీడీవో కార్యాలయ భవనం, చింతపాలెంలో రూ.25 లక్షలతో నిర్మించిన మంచినీటి పథకం, ఇంటింటి కుళాయిల ప్రారంభోత్సవాన్ని డిప్యూటీ సీఎం నిర్వహించి, శిలాఫలకాలను ఆవిష్కరించనున్నారు.

ఊహించని అభివృద్ధి



ఎ.కోడూరు పంచాయతీలో అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేశారు. దీంతో గ్రామంలోని ప్రధాన వీధులు సీసీ రోడ్లుగా రూపాంతరం చెందాయి. ప్రతీ ఇంటికీ జలజీవన్ మిషన్ పనుల్లో భాగంగా కుళాయిల ఏర్పాటు చేశాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సహకారంతో అభివృద్ధి పనులు పూర్తవడం ఎంతో ఆనందంగా ఉంది.

– లెక్కల గౌతమి, ఎంపీటీసీ, ఎ.కోడూరు

ఎరుకులమ్మ పేరంటాలు తీర్థం నేడు


తీర్థ మహోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు: దాలివలస గ్రామస్తులు మంగళవారం నిర్వహించనున్న ఎరుకులమ్మ పేరంటాలు తీర్థ మహోత్సవ పోస్టర్‌ను నిర్వాహక కమిటీ సభ్యుల సమక్షంలో సోమవారం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఆదిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ ఆలయంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలను తీసుకోవడంతో పాటు జిల్లా స్థాయి గుర్రపు పరుగు పందాలు, షెటిల్ టోర్నమెంట్‌ను జరుపుతున్నట్లు తెలిపారు. విజేతలకు నగదు పురస్కారాన్ని బహుమతిగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆదిరెడ్డి వెంకటరావు, రాము, భూమిరెడ్డి రాము, ఆదిరెడ్డి సత్యం నాయుడు, అప్పారావు పాల్గొన్నారు.

పోటీతత్వంతోనే లక్ష్య సాధన

మాకవరపాలెం: విద్యార్థుల్లో పోటీతత్వంతోనే లక్ష్యాలను చేరుకోగలరని ఎంఈవో పి.ఎస్.ఎన్. మూర్తి అన్నారు. గౌతమి లలితకళా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఉగాది వేడుకల్లో భాగంగా సోమవారం మండల స్థాయిలో విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలను ఎంఈవో ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి పోటీలతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయొచ్చన్నారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం అచ్యుతరామయ్య, గౌతమి లలితకళా శిక్షణ కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు, శేషగిరిరావు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉమామహేశ్వరీదేవి తీర్థ మహోత్సవాలు

దేవరాపల్లి: దేవరాపల్లి గ్రామ ప్రజల ఆరాధ్య దైవం ఉమామహేశ్వరీదేవి తీర్థ, కల్యాణ మహోత్సవాలు ఈ నెల 20 నుంచి 25 వరకు జరగనున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఓటు హక్కుపై అవగాహన



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

మాడుగుల రూరల్: త్వరలో జరిగే ఎన్నికల్లో ఓటర్లు తమ హక్కును వినియోగించుకోవాలని స్థానిక తహసీల్దార్ టి.సత్యనారాయణ కోరారు. కె.జె.పురం గ్రామ సచివాలయంలో సోమవారం శత శాతం ఓటు హక్కు వినియోగంపై ఎన్‌జీవో ప్రతినిధులు, ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ పోలింగ్ రోజున నిర్భయంగా ఓటు వేయాలని, ఎన్‌జీవో ప్రతినిధులు కూడా విధిగా ప్రజలకు ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరించి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి పెంకి శివ, సచివాలయ వీఆర్‌వో నాగ అప్పారావు, వలంటీర్లు పాల్గొన్నారు.

చెట్టుపల్లి వీఆర్వోపై 'స్పందన'లో ఫిర్యాదు

నర్సీపట్నం: సర్వ హక్కులు ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో భూ వివరాలు నమోదు చేసేందుకు చెట్టుపల్లి వీఆర్వో డబ్బుల కోసం ఇబ్బంది పెడుతున్నారని నర్సీపట్నం మండలం చెట్టుపల్లికి చెందిన ఎ.గోవిందరావు సోమవారం స్పందనలో డిప్యూటీ తహసీల్దార్ రాజ్యలక్ష్మికి ఫిర్యాదు చేశారు. చలానా కట్టి సర్వే చేయించుకున్నా.. అధికారులు నమోదు చేయటం లేదన్నారు. ఈ విషయాన్ని ఆర్డీవో జయరాం దృష్టికి తీసుకువెళ్తానని డీటీ హామీ ఇచ్చారు. భూ సమస్యలు, వివిధ రకాల సమస్యలపై 15 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.

వలంటీర్లకు ఘన సన్మానం


గుల్లేపల్లిలో వలంటీర్లను సన్మానిస్తున్న సర్పంచ్ దేముళ్లు


దేవరాపల్లిలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి


జేబీ పురంలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ జయమ్మ తదితరులు

కె.కోటపాడు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న వలంటీర్లు అభినందనీయులని గుల్లేపల్లి గ్రామ సర్పంచ్ బండారు దేముళ్లు అన్నారు. సేవా మిత్ర అవార్డులకు ఎంపికైన వలంటీర్లను గ్రామ సచివాలయం వద్ద సోమవారం దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎస్.రామునాయుడు, సౌందర్య పాల్గొన్నారు.

ప్రశంసనీయ సేవలు

దేవరాపల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా ప్రజలకు అందజేస్తున్న వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని దేవరాపల్లి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అన్నారు. దేవరాపల్లి-1, దేవరాపల్లి-2 సచివాలయాల పరిధిలో సేవా వజ్రా అవార్డుకు ఎంపికైన పిల్లా రాజు, సేవా రత్నకు ఎంపికైన కందుల పరమేశ్వరీతోపాటు స్థానిక వలంటీర్లను శాలువాలతో సత్కరించి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, ఎంపీడీవో సిహెచ్.సుబ్బలక్ష్మి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి.సంతోషి నళిని, పంచాయతీ సెక్రటరీ ఎస్.శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు చొక్కాకుల భవాని, కాటపల్లి సృజన, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ఎనలేనివి

చీడికాడ: ప్రజలకు పథకాలను అందించడంలో వలంటీర్ల సేవలు ఎనలేనివని ఎంపీపీ కురచా జయమ్మ అన్నారు. మండలంలోని చీడికాడ, జేబీ పురం, జి.కొత్తపల్లి, అర్జునగిరి, చుక్కపల్లి, తురువోలు సచివాలయాల్లో వలంటీర్లను దశ్శాలువాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. అర్జునగిరికి చెందిన సేవా రత్నగా ఎంపికైన ఇమంది వెంకటేష్‌ను మెడల్, ప్రసంసాపత్రంతో సత్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు గొల్లవిల్లి రాజుబాబు, సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి, సర్పంచ్‌లు బోడాల రమాదేవి, కసిరెడ్డి సూర్యనారాయణ, మజ్జి లక్ష్మణమ్మ, మట్టా అప్పారావు, చిన్నమ్మలు, ఎంపీటీసీ సుంకర లక్ష్మి, నేతలు కొల్లి శ్రీను, పరువాడ మహేష్, రాంకుమార్ పాల్గొన్నారు.

టీటీడీ సహకారంతో రామాలయాల నిర్మాణం


బుచ్చింపేటలో రామ మందిర నిర్మాణంపై మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


మైచర్లపాలెం రామాలయంలో పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

రోలుగుంట: గ్రామాల్లో రామ మందిరాల నిర్మాణానికి టీటీడీ ట్రస్ట్ నిధులు మంజూరు చేసి ఎంతగానో దోహదపడుతోందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. బుచ్చింపేటలో రామాలయ నిర్మాణానికి టీటీడీ ట్రస్ట్ నుంచి మంజూరు చేసిన రూ.10 లక్షలతో సోమవారం ఆయన గ్రామ సర్పంచ్ ఉలబాల చంద్ర, ఎంపీటీసీ సత్యవతితో కలసి శంకుస్థాపన చేశారు. అనంతరం రామ మందిర నిర్మాణం, ఆవశ్యకతలపై ధర్మశ్రీ మాట్లాడారు. ప్రతి గ్రామంలోనూ రామ మందిరం పురాతన ఆచారాల రీత్యా ఉండలన్నారు. రామ మందిరాలు లేని గ్రామాలుండకూడదనే సదుద్దేశంతో టీటీడీ ట్రస్ట్ నిధులు మంజూరు చేసి వాటి నిర్మాణానికి ఎంతగానో సహకరిస్తోందని చెప్పారు. ఇక్కడ రామాలయం శిథిలమైందని గ్రామ పెద్దలు ఉలబాల రాము, దాలయ్య, సర్పంచ్ చంద్ర, ఎంపీటీసీలు కోరిన మేరకు నిధులు మంజూరు చేయించామని తెలిపారు. శరవేగంగా నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభించాలని ధర్మశ్రీ కోరారు. భక్తుల సహకారంతో నిర్వాహకుడు ఉలబాల రాము అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చీపురుపల్లి సావిత్రి, నాయకులు వెంకునాయుడు, పెదబాబు, చినబాబు పాల్గొన్నారు.

మైచర్లపాలెంలో రామాలయం ప్రారంభం

చోడవరం: మైచర్లపాలెంలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని సోమవారం ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రారంభించి శ్రీరాముడికి ప్రత్యేక పూజలు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.10 లక్షలు నిధులు మంజూరు కాగా.. మరికొంత నిధులు గ్రామస్తులు సమకూర్చుకొని మైచర్లపాలెం గ్రామం మధ్యలో లక్ష్మణ, ఆంజనేయ, సీతా సమేతుడైన శ్రీరాముడి మందిరాన్ని నిర్మించి ఏకశిల విగ్రహాలను ప్రతిష్ఠించారు. పండితుల వేద మంత్రాల మధ్య ఆలయ ప్రారంభోత్సవం కనుల పండువగా జరిగింది. గ్రామ సర్పంచ్ బూరే మాణిక్యం పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వైద్య సేవలు


గునుపూడి పీహెచ్‌సీలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి

నాతవరం: ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పీహెచ్‌సీల ద్వారా పేదలకు వైద్య సేవలు అందించాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. మండలంలో గునుపూడి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. పీహెచ్‌సీ అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల వివరాలను వెల్లడిస్తూ ఆస్పత్రిలో నెలకొన్న ప్రధాన సమస్యలను వైద్యాధికారి అనూష్ వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గునుపూడి పీహెచ్‌సీపై మండలంలోని మారుమూల గ్రామాలైన 14 గ్రామ పంచాయతీల ప్రజలు ఆధారపడి ఉన్నారన్నారు. పీహెచ్‌సీలో రోగులకు సక్రమంగా వైద్య సేవలందించేందుకు సిబ్బంది దృష్టి సారించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే పీహెచ్‌సీలో రూ.25 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రస్తుతం పలు సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.75 లక్షలతో వైద్యాధికారి, కమిటీ సభ్యుల సూచనలు మేరకు ఖర్చు చేయాలని తీర్మానించామని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కృషితో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో 150 పడకలు చేయడంతోపాటు కోట్లాది రూపాయలతో అదనపు భవనాలు నిర్మించి ప్రారంభించారన్నారు. నాతవరం పీహెచ్‌సీలో రూ.2 కోట్లతో అదనపు భవనం నిర్మించి రోగులకు వసతి సమస్య తీర్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జె.రాంబాబు గునుపూడి సర్పంచ్ వేముల సూర్యనారాయణ, పీహెచ్‌సీ వైద్యాధికారి అనూష, గుమ్మడిగొండ ఎంపీటీసీ సభ్యులు సుర్ల అచ్చియ్యనాయుడు, మాజీ ఎంపీటీసీ వేముల సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు దేవాడ శ్రీను, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల్లోనే అన్ని రకాల సేవలు


సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: సచివాలయాల ద్వారా ప్రజలకు అవసరమైన సేవలు అందించే విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని ఎంపీడీవో జె.రాంబాబు అన్నారు. మండలంలోని గునుపూడి సచివాలయాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందించే సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుల గణన సర్వే బాధ్యతగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలు గ్రామంలోనే అన్ని రకాలు సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో డ్రైనేజీల పనులు, తాగునీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి మనిషికి కూలీ పని కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పీజీ కోర్సులు నిర్వహించాలని వినతి

నర్సీపట్నం: గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించేందుకు వీలుగా ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సులు అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రెసిడెంట్ జి.గీతాకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో పీజీ కోర్సులు లేక దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే ఆర్థిక స్తోమత లేక డిగ్రీతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామీణ విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ, ఎంఏ కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చి ఉన్నత చదువులకు బాట వేయాలన్నారు.

కాలిబాట కోసం ర్యాలీ

చీడికాడ: బందకొండకు వెళ్లే కాలిబాటను అడ్డుకునే వారిపై చర్యలు తీసుకోవాలని అఖిల భారతి వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పి.ఎస్.అజయకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో కోనాం శివారు బందవీధి గిరిజనులతో కలిసి చీడికాడలో ర్యాలీ చేశారు. ఆయన మాట్లాడుతూ బందకొండలో ప్రభుత్వం ఆదివాసీ గిరిజనులకు అటవీ హక్కుల చట్టం కింద పట్టాలిచ్చిందన్నారు. దశాబ్దాల తరబడి బందకొండకు ఆదివాసీలతోపాటు అటవీ శాఖ సిబ్బంది వినియోగించే కాలిబాటను కొంతమంది భూస్వాములు డీ-ఫారం భూములను కొనుగోలు చేసి దారి మూసి గిరిజనులు వెళ్లకుండా అడ్డుకుంటున్నారన్నారు. అదే కొండపై ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేసి వనసంరక్షణ సమితి ద్వారా అటవీ పునర్జీవన కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. ఆ కొండకు వెళ్లేందుకు ఈ కాలిబాట ఒకటే దిక్కని, ఆ దారిని అడ్డుకోకుండా చూడాలని ఆయన కోరారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందించారు.

ఎమ్మార్పీస్ మండల కమిటీ ఏకగ్రీవం

రోలుగుంట: ఎమ్మార్పీస్ మండల కమిటీ ఏకగ్రీవమైనట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు ఎనకా మల్లిబాబు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గల బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద సోమవారం మండల స్థాయిలో ఎమ్మార్పీఎస్ సభ్యులు సమావేశమయ్యారు. సంఘ అభివృద్ధి, సమస్యలపై చర్చించుకున్న అనంతరం మండల కమిటీ ఏర్పాటుకు ఎన్నిక నిర్వహించారు. అందరి ఆమోదం మేరకు సంఘం మండల శాఖ అధ్యక్షుడిగా రోలుగుంటకు చెందిన పులగుజ్జల శివ, ఉపాధ్యక్షుడిగా కొమరవోలుకు చెందిన కోడి దేముడు, కోశాధికారిగా గజ్జల లక్ష్మి, 12 మందితో కూడిన కమిటీని ఎంపిక చేశారు. ఎంపికైన కమిటీని మల్లిబాబు ప్రకటించారు. ఈ సందర్భంగా పులగుజ్జల శివ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కమిటీతో కలిసి పనిచేస్తానన్నారు. ముఖ్య అతిథిగా జిల్లా కార్యవర్గ ప్రతినిధి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఆవిష్కరణకు తరలిరండి


బార్ అసోసియేషన్ ప్రతినిధులకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: నూతన రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేస్తున్న దేశ నాయకుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి పట్టణ ప్రముఖులు తరలిరావాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన పలు సంఘాల నాయకులను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సీపట్నం శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి కొత్తవీధి మీదగా పెదబొడ్డేపల్లి వరకు రూ.6 కోట్లతో తారురోడ్డు నిర్మించామని తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా దేశ నాయకుల విగ్రహాలతోపాటు పచ్చదనాన్ని పెంపొందించేందుకు వీలుగా మొక్కలు నాటాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో సంఘాల నాయకులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ముందుగా ఆర్యవైశ్య సంఘం, బార్ అసోసియేషన్ ప్రతినిధులకు ఆహ్వాన పత్రిక అందించామన్నారు. రోటరీ క్లబ్, వాసవీ క్లబ్, వాకర్స్ క్లబ్, వివిధ సంఘాలను భాగస్వాములను చేస్తున్నామన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో నర్సీపట్నం కొత్త కల సంతరించుకుందన్నారు. ఈ నెల 24న జరిగే విగ్రహాల ఆవిష్కరణ, మొక్కలు నాటే కార్యక్రమానికి తరలిరావాలని ఎమ్మెల్యే గణేష్ కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, పార్టీ నాయకులు చింతకాయల వరుణ్, టౌన్ పార్టీ అధ్యక్షులు ఏకా శివ, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.